ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 10 ఏప్రిల్ 2024





చౌకగా.. బియ్యం మాత్రమే

చౌక దుకాణాలు.. టీడీపీ హయాంలో మినీ మాల్స్‌లా ఉండేవి. బియ్యం, పంచదార, పామాయిల్, గోధుమ, కందిపప్పులతో పాటు ప్రజలకు అవసరమైన పలు రకాల వస్తువుల విక్రయాలతో కళకళలాడేవి. మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఉప్పు పప్పుల నుంచి సబ్బులు, నూనెలు, గోధుమ పిండి తదితరాలు ఎన్నో అందుబాటులో ఉండేవి. పెరిగిన ధరలతో కొనుగోలు చేయలేక ఇబ్బందిపడే సరుకులను కూడా సబ్సిడీతో చౌక దుకాణాల్లో కార్డు దారులకు ప్రభుత్వం అందించేది. ఇక పండుగల సమయాల్లో ప్రత్యేకంగా సరుకులను చౌక దుకాణాల ద్వారా కానుకల రూపంలో పంపిణీ జరిగేది. అయితే వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత రేషన్ వ్యవస్థను సంస్కరిస్తున్నామంటూ భ్రష్టు పట్టించేశారు. రేషన్ అంటే బియ్యం మాత్రమే అన్నట్లుగా మార్చేసింది. కందిపప్పు, పంచదార అర కొరగానే పంపిణీ చేస్తుంది. మార్కెట్లో అందుబాటులో లే కుండా విపరీతంగా ధరలు పెరిగిపోయి సామాన్యులు విలవిల్లాడుతున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందే కాని ఆయా సరుకులను సబ్సిడీపై అందించాలన్న కనీస ఆలోచన చేయడం లేదు. ఇలా పౌరసరఫరాల వ్యవస్థను పూర్తిగా దిగజార్చడంపై ఎన్ని విమర్శలు వస్తున్నా వైసీపీ పాలకులు పట్టిం చుకోవడంలేదు.

- రేషన్ సరుకుల్లో కోతలు
- నామమాత్రంగానే సరుకుల పంపిణీ
- పామాయిల్, గోధుమ పూర్తిగా కనుమరుగు
- లబ్ధిదారులపై పెరిగిన నెలవారీ ఆర్థిక భారం
- ఐదేళ్లుగా దిగజారిపోయిన పౌరసరఫరాల వ్యవస్థ

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వచ్చి రేషన్ బియ్యం అందజేస్తాం అంటూ ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఆచరణలో పౌరసరఫరాల వ్యవస్థను కోలుకోలేనంతగా దెబ్బతీసింది. ఐదేళ్ల క్రితం తొలిగా మొబైల్ డిస్పెన్సరీ వాహనాలతో హడావుడి చేసింది. ఆ పేరుతో అప్పటి వరకూ పేదలకు అందే నిత్యావసర సరుకులను వారికి ఇవ్వకుండా చేసిందన్న విమర్శలు వచ్చాయి. అప్పటి వరకూ పేదలకు బియ్యం పంచదారతోపాటు అందుతూ వచ్చిన కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి వంటి సరుకులు వారికి అందకుండా పోయాయి. కరోనా తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న బియ్యం మాత్రమే పంపిణీ జరుగుతోంది. కందిపప్పు నూటికి 30 కుటుంబాలకు, గోధుమపిండి నూటికి 15 కుటుంబాలకు మాత్రమే అందుతోంది. దీంతో లబ్ధిదారులపై నెలవారీ ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోయింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 17 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వాటి ద్వారా మూడు జిల్లాలో సుమారు 50 లక్షల మందికి రేషన్ సరుకులు అందిస్తారు. ప్రతి నెలా మనిషికి 5 కిలోల బియ్యంతో పాటు, అరకిలో పంచదార, కిలో కందిపప్పు చౌక ధరలకు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం క్రమంగా వాటిని తగ్గిస్తూ వచ్చింది. ఒక్క బియ్యం మినహా మిగిలిన సరుకులకు రకరకాల కారణాలతో కోత విధించారు. 2022 నుంచి పంచదార, కందిపప్పు సరఫరా పడిపోయింది. కందిపప్పు సరఫరా మూడొంతులు తగ్గింది. ఎన్నికలు సమీపించే సమయానికి లబ్ధిదారులను ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో భాగంగా తిరిగి కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం స్వీకారం చుట్టింది. పండుగ నెలలైన డిసెంబరు, జనవరిలో కూడా కార్డుదారులకు కందిపప్పు అందించలేక అబాసుపాలైంది. కాగా గోధుమ పిండి సరఫరా చేస్తామని హడావుడి చేసిన ప్రభుత్వం అందులోనూ చేతులెత్తేసింది. నూటికి 15 కుటుంబాలకు కూడా గోధుమపిండి సరఫరా చేయలేక గుడ్లు తేలేసింది. అంతగా పౌర సరఫరాల శాఖ పరిస్థితి దిగజారింది. ఒకానొక దశలో నెలల తరబడి అర కిలో పంచదార కూడా సరఫరా చేయలేకపోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు.

1700 టన్నుల నుంచి 4 టన్నులకు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని కార్డుదారులకు గతంలో 1700 టన్నుల కందిపప్పు సరఫరా జరిగేది. అయితే వైసీపీ ప్రభుత్వం కోత విధించుకుంటూ దానిని 4 టన్నులకు పరిమితం చేసింది. ఆ కందిపప్పును కూడా పౌర సరఫరాల శాఖ ప్రతీ నెలా సరఫరా చేయలేకపోతోంది. ఫలితంగా నూటికి 70 కుటుంబాలకు కందిపప్పు అందకుండానే పోతోంది. 2023కు వచ్చే సరికి పరిస్థితి మరింత దిగజారిపోయింది. జూలైలో 17 లక్షల కిలోలకు ప్రభుత్వం 935 కిలోలు మాత్రమే కందిపప్పును సరఫరా చేసింది. ఆగస్టులో పల్నాడు జిల్లాలోని 6లక్షల 36 వేల కుటుంబాలకు 12 కిలోల కందిపప్పు పంపిణీ చేసింది. దీనినిబట్టి పౌర సరఫరాల వ్యవస్థ ఎంతగా కుదేలైపోయిందో తెలిపోతోంది.

కోతలతో పాటు పెరిగిన ధరలు

వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకూ రేషన్ సరుకుల్లో భారీగా కోత పడింది. టీడీపీ హయాంలో 2018 మార్చి నుంచి ఒక్కో కుటుంబానికి 2 కిలోల కందిపప్పు రూ.40 చొప్పున ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం దానిలో కోత పెట్టి కిలోకి తగ్గించింది. ధరను రూ.40 నుంచి రూ.67కి పెంచింది. అయినప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో కుటుంబానికి కిలో పంచదార రూ.20 చొప్పున అందించేది. దాన్నీ ఈ ప్రభుత్వం అరకిలోకి తగ్గించి రూ.17 వసూలు చేస్తోంది. అంటే కిలోకు రూ.14 పెంచినా అది కూడా అరకొర సరఫరా చేస్తున్నారు. 2018-19లో రాగులు, జొన్నలు, గోధుమపిండి, ఉప్పు తదితరాలను లబ్ధిదారులకు రేషన్ సరుకులతో పాటు పంపిణీ చేశారు. దాంతోపాటు పండుగ సమయాల్లో, నూనె ధరలు అధికంగా ఉన్న సమయంలో పామాయిల్‌ను సబ్సిడీ ద్వారా కిలో రూ.40 పంపిణీ చేసేవారు. ప్రస్తుతం వంట నూనెల ధరలు మూడంకెల సంఖ్యను చేరినా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం వంట నూనె ఇచ్చిన దాఖలాలు లేవు. పైపెచ్చు ప్రతి ఏటా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు ఇచ్చే కానుకలు, తోఫాలను పూర్తిగా ఆపేసి చేతులు దులుపుకుంది.

సామాన్యులపై పెరిగిన భారం

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులే ఆధారం. ఆకాశాన్నంటుతున్న సరుకుల ధరలు, అంతంత మాత్రం సంపాదనలో పేదల ఆకలి తీర్చేది ప్రభుత్వం అందించే రేషన్ మాత్రమే. కానీ ప్రభుత్వం పౌర సరఫరాల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి కోలుకోలేనంతగా దెబ్బతీసింది. నూటికి పది మందికి ఒకటి, అరా సరుకులు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. దీంతో వారంతా బహిరంగ మార్కెట్లో సరుకులను కొనుక్కోవాల్సి వస్తోంది. కందిపప్పు కిలో రూ.160, వంట నూనె కిలో రూ.110, గోధుమపిండి కిలో 70, పంచదార కిలో రూ.45 ఉన్న నేపథ్యంలో అవి రేషన్ షాపుల్లో చౌక ధరలకు లభ్యమైతే వారిపై భారం తగ్గేది. అయితే ఆయా సరుకులు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయని కారణంగా వారు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుక్కో వాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్కో కుటుంబంపై సగటున నెలకు 500 నుంచి రూ.వెయ్యి మేర అదనపు భారం పడు తోంది. ఈ భారం మోయ లేక జన సామాన్యం తీవ్ర ఇబ్బందులు పడుతోంది.



వేడుకగా.. శ్రీక్రోధి

- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం
- ప్రముఖులకు, కళాకారులకు ఉగాది పురస్కారాలు

గుంటూరు (తూర్పు), గుంటూరు సిటీ, ఏప్రిల్ 9: తెలుగువారి నూతన సంవత్సరం శ్రీక్రోధి నామ ఉగాది వేడుకలు మంగళ వారం వేడుకగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు పెద్దఎత్తున జరిగాయి. ప్రజలు ఉగాది పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ కూడళ్ల, సంస్థల కార్యాలయాల్లో కూడా ఉగాది వేడుకలను నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఆలయాల్లో వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమలు ఆకట్టుకున్నాయి, విశిష్ట సేవలందించిన ప్రముఖులకు, కళాకారులకు పురస్కారాలు అందించి సత్కరించారు. ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు జరుపుకున్నారు. ఇళ్లల్లో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలను ధరించి ఇంటి గడపలను మామిడి తోరణాలతో అలంకరించి ఇష్ట దైవాలకు పూజలు చేసి ఉగాది పచ్చడిని ప్రసాదంగా తీసుకున్నారు. ఉగాది సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయాల్లో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. నూతన పంచాంగాలాను భక్తులను పంపిణీ చేశారు. ఉగాదిని పురస్కరించుకుని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవాలయాలు, రచ్చబండలు, ప్రధాన కూడళ్లల్లో జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తమ రాశి ఫలాల గురించి ఆసక్తికరంగా పురోహితులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది కుటుంబ సభ్యుల్లో మంచి రాశి ఫలం ఉన్న వారిచే వ్యవసాయ పనులను ప్రారంభించాలని పండితులు రైతులకు సూచించారు.



వేద పండితులను సత్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, అలంకరణలో స్వామివారు

- ఉగాది సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అర్చకులు, వేదపండితులను సత్కరించారు. ఆమంచి వెంకటేశ్వర్లు, సంగాపు మల్లికార్జునరావు, ఆమంచి వెంకటేశ్వరుడులకు నూతన వస్త్రాలు, పండ్లు, 10,116 నగదు పారితోషకం, శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమములో దేవదాయశాఖ ఏసీ వి.అనుపమ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు కలెక్టర్‌కు వేద ఆశీర్వచనం చేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ ఉచ్చులో.. వలంటీర్లు

- వారి భవిష్యత్‌తో నేతల చెలగాటం
- ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రచారాలు
- రెచ్చగొట్టి మూకుమ్మడిగా రాజీనామాలు
- వలంటీర్లపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి





పల్నాడు జిల్లాలో ఇటీవల రాజీనామాలు చేసిన వలంటీర్లు

బాపట్ల, ప్రత్తిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. ప్రజా ధనం నుంచి గౌరవ వేతనాలు తీసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.. ఇది కరెక్ట్ కాదు... అని ప్రతిపక్ష నాయకులతో పాటు ఎన్నికల సంఘం కూడా చెప్తోంది. అయితే ఇదేమీ పట్టని కొందరు వలంటీర్లు వైసీపీ నాయకులు చెప్పినట్లుగా చేస్తూ వస్తోన్నారు. మొత్తంమీద అధికార పార్టీ నేతల ఉచ్చులో వలంటీర్లు పడిపోతున్నారు. వలంటీర్ల భవిష్యత్‌తో వైసీపీ చెలగాటమాడుతోందన్న విమర్శలు కూడా వస్తున్నాయి. కోడ్ అమలులో భాగంగా ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలకు వైసీపీ రాజకీయ జోక్యాన్ని అంటగడుతుం ది. మొన్నటి వరకు కోడ్ ఉల్లంఘించేలా ప్రచారంలో భాగస్వామ్యం చేసి వలంటీర్లు సస్పెన్ష న్‌కు గురి కావడానికి పరోక్షంగా వైసీపీ నేతలే కారణమ య్యారన్న ఆరోపణలున్నాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించే వలంటీర్లకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని టీడీపీ నేతలు గతంలోనే చెప్పి ఉన్న సంగతి తెలిసిందే. కానీ కోడ్ అమల్లోకి వచ్చాక కొంతమంది వలంటీర్లు అత్యుత్సాహం ప్రదర్శించడంతో నిబంధనల ప్రకారం అధి కారులు వారిమీద చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ చర్యలను టీడీపీకి ఆపాదిస్తూ వారిని మరింత రెచ్చగొట్టి ఓట్ల పబ్బం గడుపుకో వాలని వైసీపీ చూస్తోంది. తాజాగా సామాజిక పింఛన్ల పంపిణీలో ఈసీ ఆదేశాలకు వక్రభాష్యం చెబుతూ వలంటీర్లను రెచ్చగొడుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను మసిపూసి మారేడు కాయ చేస్తూ వలం టీర్లను రాజకీయ క్రీడలో పావులుగా వాడుకోవడంపై టీడీపీ మండిపడు తోంది. వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకమనే బోగస్ ప్రచారాన్ని వైసీపీ నేతలు పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఈసీ కన్ను వలంటీర్‌ల మీద ఉందని తెలిసినా వారిని లొంగదీసుకుని ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేస్తూ వారి సస్పెన్ష న్‌కు కారణమయ్యారు. ఇప్పుడేమో వారిని రాజీ నామాలు చేయమని వైసీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నా రు. వారిని రెచ్చగొట్టి పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారానికి వాడుకునే దు ర్మార్గ క్రీడకు వైసీపీ పూనుకుం టోండగా దానిని పసిగట్ట లేని పల వురు వారి ఉచ్చులో పడుతున్నారు. ఈ క్రమంలో వారి భవిష్యత్ ఏమైనా పర్వాలేదనే రీతిలో అధికార పార్టీ నేతల వ్యవహార శైలి ఉండడం గమనార్హం. వలంటీర్లలో చాలా మంది డిగ్రీ, పీజీలు చేసిన వారు కూడా ఉన్నారు. నిబంధనలు అతిక్రమించడంతో ఈసీ ఆదేశాల మేరకు పలువురిపై వేటు పడుతోంది. భవిష్యత్‌లో వారి ఉన్నతికి ఇది శాపంగా పరిణమించే అవ కాశం ఉందనే ఆవేదనను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమించి వైసీపీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, గ్రూపులలో సదరు నేతలకు అనుకూలంగా ప్రచారం చేయ డం వంటి అంశాల తో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 30 మందికి పైగా సస్పెన్షన్‌కు గురయ్యారు. కర్లపాలెం మండల పరిధిలో వైసీపీకి అనుకూలంగా ప్రచా రం చేసినందుకు ఓ మహిళా వలంటీర్‌పై ప్రభుత్వం గతంలోనే వేటు వేసింది. బల్లికురవ మండల పరిధిలో వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నందుకు మరో ఇద్దరి వలంటీర్లపై చర్య తీసుకున్నారు. ఇవన్నీ పూర్తిగా కోడ్ ఉల్లంఘన కిందకు రావడం వల్లే అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఈ సస్పెన్షన్లకు కారణం టీడీపీయే అంటూ మరి కొంతమంది వలంటీర్లను తమ ఉచ్చులోకి లాగే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. ఇక పెన్షన్లు అందించే విషయంలో ఈసీ నిర్ణయానికి వక్రభాష్యం చెబుతూ వలంటీర్ల చేత రాజీనామాలు చేసే విధంగా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే దాదాపు 50 మంది వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి రాజకీయ క్రీడలోకి వారిని లాగుతున్నారు. వలంటీర్ల గౌరవవేతనం పెంచడంతో పాటు వారి ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండబోదని ఇప్పటికే పలు సందర్భాల్లో టీడీపీ ప్రకటించి ఉంది. వలంటీర్ల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని అధికారుల ముందు వారిని దోషులుగా నిలబెడుతున్నారంటున్నారు.

నాడు హీరోలు.. నేడు జీరోలు

నిన్న మొన్నటి వరకు వలంటీర్లను అధికార పార్టీ హీరోలుగా చిత్రీకరించింది. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వారిదే కీలకపాత్ర. అటు పార్టీ శ్రేణులు, ఇటు ప్రభుత్వ ఉద్యోగులకంటే వీరిదే తుది నిర్ణయం. వారి సేవలను కీర్తిస్తూ పురస్కారాలను కూడా అందించారు. అలాంటి వలంటీర్లను ఇప్పుడు జీరోలను చేస్తున్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం వారిని పావులుగా వాడుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీని బూచిగా చూపిస్తూ వలంటీర్ల చేత రాజీనామాలు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ నాయకుల కనుసన్నల్లో రాజీనామాల కుతంత్రం జరుగుతుంది. వలంటీర్స్ మండల లెవల్ అధికారుల గ్రూపులలో డైరెక్టుగా మెసేజ్ పెడుతూ రాజీనామాలపై వత్తిడి చేస్తున్నారు. అంతేకాకుండా స్థానిక నాయకులు కూడా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించే పనిలో పడ్డారు. మరలా మన పార్టీ వస్తుంది.. అప్పుడు మిమ్మల్నే వలంటీర్లుగా నియమిస్తాం.. ముందు మీరు రాజీనామా చేయండి అంటూ హుకుంలు జారీ చేస్తున్నారు. తాజాగా ప్రత్తిపాడులో 65 మంది వలంటీర్లు ఉండగా వారిలో 59 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వట్టిచెరుకూరు మండలం గారపాడు, కుర్నూతల గ్రామాలలో వలంటీర్లు కొందరు రాజీనామా చేశారు. ఇదే రీతిలో మిగిలిన గ్రామాల్లో కూడా వలంటీర్ల చేత రాజీనామా చేయించే పనిలో వైసీపీ నాయకులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్లు.. పాట్లు

- ఫెసిలిటేషన్ సెంటర్లు అరకొరగా ఏర్పాటు చేస్తే ఇబ్బందే
- గత ఎన్నికల్లో ఏసీ కళాశాల కేంద్రంలో తీవ్ర గందరగోళం
- ఈ దఫా అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి
- ప్రతీ నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తేనే మంచిది

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ సెంటర్ల విషయంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండకపోతే తీవ్ర గందరగోళానికి దారి తీసే అవకాశం ఉంది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏసీ లా కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఒకే రోజున వేల సంఖ్యలో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు రావడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. ఉదయం ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులు సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వచ్చిం ది. ఆ పరిస్థితుల్లో ఫెసిలిటేషన్ సెంట ర్‌ని రెండు, మూడు రోజుల పాటు పొడి గించడం వల్ల కొంత మేరకు అప్పటి అధికారులు సమస్యని పరిష్కరించారు. ఈ దఫా అలాంటి సంఘటనలు తలెత్తితే వాటి పరిణామాలు ఎటుదారి తీస్తాయోనన్న ఉత్కంఠ నెలకొన్నది. ఎన్నికల రోజున విధుల్లో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు, ఇతర కేటిగిరీలకు చెందిన ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫెసిలిటేషన్ సెంటర్లని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేస్తుంది. మొత్తం 33 కేటిగిరీలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. సర్వీసు ఓటర్లు మాత్రమే తమ ఓటుని పోస్టల్ ద్వారా పంపుతా రు. పోలింగ్ రోజున విధుల్లో ఉండే వారు తప్పనిసరిగా ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేయాల్సిందే. ఈ దఫా జిల్లాలో ఎట్టలేదన్నా 20 వేల మందికి పైగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉన్నట్లు అంచనా. మంగళగిరి, గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లోనే ఎక్కువ మంది ఉంటారు. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇప్పటి నుంచే పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన, ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలని పలువురు సూచిస్తున్నారు. ఎక్కువ ఓటర్లు ఉన్న నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను రెండు, మూడు రోజుల పాటు అందుబాటులో ఉంచడం మంచిదంటున్నారు. రద్దీ తలెత్త కుండా ఉండేందుకు సీరియల్ నెంబరు వారీగా ఫెసిలిటేషన్ సెంటర్‌కి వచ్చి ఓటు వేసేలా చేస్తే మేలన్న అభిప్రాయం ఉంది.



2019 ఎన్నికల సమయంలో ఏసీ లా కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద పరిస్థితి

వాహనాన్ని ఆపారు.. వదిలేశారు

- ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీలపై అనుమానాలు
- ఓ బస్తా నిండా వైసీపీ జెండాలు, కరపత్రాలు
- మిగిలిన బస్తాల్లో మద్యం, డబ్బు ఉన్నట్లు ఆరోపణలు
- రూ.6 లక్షల సామగ్రికి ఇన్వాయిస్.. అదంతా ఎవరి ఖాతాలోకి

గుంటూరు, ఏప్రిల్ 9: ఎన్నికల సమయం తనిఖీ బృందాలు అప్రమత్తంగా ఉండాలి. అనుమతి లేకుండా ప్రచార సామగ్రి, తాయిలాలు, మద్యం తదితరాలను ఎక్కడికక్కడ కట్టడి చేయాలి.. కేసులు పెట్టాలి.. అని నిరంతరం ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేస్తూనే ఉన్నారు. అయితే కొందరు అధికారులు తనిఖీలు పక్కాగా చేసి ఎన్నికల సామగ్రి, మద్యం తదితరాలను పట్టుకుంటున్నా అందులో పక్షపాతం చూపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన వారి విషయంలో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలకలూరు రోడ్డులో జోన్-1 ఫ్లయింగ్ స్క్వాడ్ టీం-1 ఇన్‌చార్జి బుస్సా రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పలకలూరు వైపు నుంచి నగరంలోకి ఓ డీసీఎం మినీ లారీ నిండుగా బస్తాలు ఉండడంతో అధికారులు ఆపి తనిఖీలు చేశారు. అందులో పైన ఉన్న బస్తాను కిందకుదించి చూడగా అందులో వైసీపీకి చెందిన జెండాలు, కరపత్రాలు వంటి ఎన్నికల సామగ్రిని అధికారులు గుర్తించారు. దీనిపై డ్రైవర్‌ను ప్రశ్నించగా ఆయన ఓ ఇన్వాయిస్ చూపగా అందులో వైసీపీ కార్యాలయం తాడేపల్లి, రూ.6 లక్షల మూడు వేలకు బిల్లు ఉంది. అయితే కవరుపై ఆనందరావు, రాజేంద్రనగర్ అని, ఫోన్ నెంబరు ఉండటంతో ఫోన్ చేయగా ఓ వ్యక్తి అక్కడికి చేరుకున్నారు. తానే ఆనందరావు అని, తనది కర్నూలు అని, గుంటూరు లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిని అని చెప్పారు. వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి సామగ్రి వచ్చినట్లు తెలిపారు. అయితే వ్యాన్‌లో ఉన్న అన్ని బస్తాల్లో ఏమి ఉందనేది పరిశీలించలేదు. పార్టీ జెండాలు, కరపత్రాలకు సంబంధించిన సామగ్రినా లేదంటే అడుగున డబ్బు, మద్యం ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. వాహనం ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్తుంది, ఈ మెటీరియల్ ఎవరి ఖాతాలో జమ చేయాలనేది కూడా అధికారుల దృష్టి సారించలేదు. అధికారులకు పైనుంచి ఫోన్ రావడంతోనే వదిలేశారనే ఆరోపణలు వచ్చాయి. తనిఖీల్లో వైసీపీ ఎన్నికల మెటీరియల్ పట్టుబడినట్లు సమాచారంతో కొంతమంది టీడీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారు. అయినా సంబంధిత అధికారి అన్ని బస్తాలను తనిఖీ చేయలేదు. పైగా వాహనాన్ని ఇన్‌వాయిస్ ఉందంటూ వదిలివేయడంపై టీడీపీ శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి.



పలకలూరురోడ్డులో వైసీపీ మెటీరియల్‌తో ఉన్న మినీ లారీ



పెదకాకాని మండలంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న పెమ్మసాని, ధూళిపాళ్ల తదితరులు

6 లో..

వైభవంగా ఉగాది


ఉగాది పూజల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, ఏప్రిల్9: తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన పండగల్లో ఒకటైన ఉగాదిని పల్నాడు జిల్లా ప్రజలు మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. వేద పండితుల పంచాంగ శ్రవణాలతో అంతటా తెలుగు కళ ఉట్టిపడింది. ఉగాదిని పురష్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ ఏడాదిలో రాశిఫలాలు ఎలా ఉన్నాయో తెలుసుకునే ఉత్సుకత అందరిలో కనిపించింది. వేద పండితులు వారి పేరుకు తగ్గట్టు ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్యం, అవమానాలు గురించి అడిగి తెలుసుకున్నారు. దేవాలయాల్లో పంచాగ శ్రవణాలు నిర్వహించారు.

నరసరావుపేట లోక్‌సభ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు స్థానిక ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

సత్తెనపల్లిలోని తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఉగాది వేడుకలు జరుపుకున్నారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బంది, అధికారులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీక్రోధి నామ సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మూడు ముక్కలాటకు స్వస్తి పలకాలి

- లేదంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు
- 1575వ రోజుకు రైతుల ఆందోళనలు


బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, ఏప్రిల్ 9: మూడు ముక్కలాటకు సీఎం జగన్‌రెడ్డి స్వస్తి పలకాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని, బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1575వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు, మహిళలు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వైసీపీ పాలకులుఒ చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి కళ్లు తెరవకపోతే జీవితంలో మూడు అని చేసిన దుర్మార్గానికి తగిన శిక్ష తప్పదని హెచ్చరించారు.అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రచారంలో పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్


తక్కెళ్ళపాడు ప్రచారంలో కూటమి అభ్యర్థులు పెమ్మసాని, ధూళిపాళ్ల, వారికి బాబు జగ్జీవన్‌రావు చిత్రపటాన్ని అందిస్తున్న స్థానిక టీడీపీ నేతలు

పెదకాకాని, ఏప్రిల్ 9: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, మరో 30 ఏళ్లపాటు సుదీర్ఘ రాజకీయాలు చేస్తానని గుంటూరు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు, వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, గోళ్లమూడి, నంబూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్రాణం మార్కండేయబాబు, తాళ్ల వెంకటేష్‌యాదవ్, ఉగ్గిరాల సీతారామయ్య తదితరులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రశేఖర్, నరేంద్రకుమార్‌లు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యని శాశ్వతంగా పరిష్కారం చేస్తామన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ పథకం కింద రూ.5లక్షల వరకు పరిమితి ఉండేది, దానిని ఇప్పటి ప్రభుత్వం రూ.3 లక్షల తగ్గించిందని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి తెలిపారు. మహిళలకు మహాశక్తి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు ఇస్తామని తెలిపారు. వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు గ్రామాల ప్రజలకు శాశ్వతంగా మంచి నీళ్ల అందేటట్లు చేస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి రాగానే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి పంట పొలాలకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షులు వెలినేని శ్రీనివాసరావు(బాబు), మండల జనసేన పార్టీ అధ్యక్షులు వీరెళ్ళ వెంకటేశ్వరరావు, బీజేపీ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, పెదకాకాని మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.


తక్కెళ్ళపాడులో భారీ ర్యాలీలో ప్రసంగిస్తున్న పెమ్మసాని, వేదికపై నరేంద్ర, జనసేన ఇన్‌చార్జి వడ్రాణం మార్కండేయబాబు

పాత కేసులు తీయండి.. నోటీసులు ఇవ్వండి

- కోడ్ వచ్చినా తీరు మారని పోలీసులు
- అధికార పక్షం సేవలో తరిస్తున్న అధికారులు
- ప్రతిపక్ష నేతలకు నోటీసులు, వేధింపులు
- నాలుగున్నరేళ్ల క్రితం పెట్టిన అక్రమ కేసుల వెలికితీత
- వాటి ఆధారంగా ఎన్నికలకు దూరం చేసే కుట్ర
- కనపర్తిపై ఏకంగా 18 కేసులు.. తాజాగా 6 నోటీసులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లుగా అధికార పార్టీ సేవలో తరిస్తోందన్న అపకీర్తిని మూటగట్టుకున్న రాష్ట్ర పోలీసు యంత్రాంగం తీరు ఇప్పటికీ మారినట్లుగా లేదు. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా, పరిపాలన అంతా ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లిపోయినా పోలీసులు మాత్రం తమ స్వామి భక్తిని చాటుకుంటూనే వున్నారు. ఇప్పటికే గుంటూరు నగరంలో ఇద్దరు నేతలకు నోటీసులు జారీ చేసిన పోలీసు అధికారులు, మిగిలిన టీడీపీ నాయకులపై పెట్టిన కేసులను కూడా తిరగదోడే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రతిపక్షాలకు చెందిన కీలక నేతలందరినీ అదుపులోకి తీసుకోవడమో, కేసుల పేరుతో ఎన్నికల ప్రక్రియకు దూరం చేయడమో లక్ష్యంగా అధికార పార్టీ ఈ కుట్రలకు పాల్పడుతుందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.


కనపర్తి శ్రీనివాసరావుకు 41ఏ నోటీసులు ఇస్తున్న అరండల్‌పేట ఎస్ఐ నరేంద్ర, ఏఎస్ఐ నాగేశ్వరరావు

కరోనా కేసులకు ఇప్పుడు నోటీసులు

అధికార వైసీపీ కరోనా లాక్‌డౌన్ నిబంధనలను తన స్వప్రయోజనాల కోసం వాడుకున్నట్లు తాజాగా వెలుగు చూస్తున్న కేసులను బట్టి తెలుస్తోంది. లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారన్న పేరుతో ప్రతిపక్ష టీడీపీ నేతలపై ఇష్టారాజ్యంగా కేసులు బనాయించి వాటిని ఇప్పుడు ప్రతిపక్షాలపై ప్రయోగిస్తున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం పెట్టిన కేసులను ఇప్పుడు తిరగదోడి ప్రతిపక్ష నాయకులకు 41ఏ నోటీసులు జారీ చేస్తున్నారు. కేసుల విచారణ పేరుతో వేధింపులకు దిగుతున్నారు. సరిగ్గా వారం రోజుల క్రితం తెలుగుయువత నేతకు 41ఏ నోటీసులు ఇచ్చిన పోలీసులు తాజాగా మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావుకు నోటీసులు అందజేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 6 కేసుల్లో ఆయనకు నోటీసులు అందజేశారు. అసలు తమపై ఆ కేసులు ఉన్నాయని కూడా చాలామంది ప్రతిపక్ష నేతలకు తెలియదు. నోటీసులు ఎందుకిస్తున్నారని ఆరా తీసిన కనపర్తికి ఇలాంటి అనుభవమే ఎదురైంది. అతడిపై అరండల్‌పేట స్టేషన్ పరిధిలో 9 కేసులు, పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒక హత్యానేరం కేసుతో పాటు 3 కేసులు, కొత్తపేట స్టేషన్ పరిధిలో 3, లాలాపేట స్టేషన్ పరిధిలో 1, నగరంపాలెం పరిధిలో 1, నందిగామలో 2 కేసులు, మొత్తంగా 19 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో ప్రతిపక్ష పార్టీల్లో కలకలం రేగింది.

ఎన్నికల కమిషన్‌పై నెపం

అధికార వైసీపీ సేవలో తరిస్తున్న పోలీసులను నోటీసులందుకున్న ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తుండడంతో పోలీసులు ఎన్నికల కమిషన్ మీదకు నెపం మోపుతున్నారు. తమకేమీ సంబంధం లేదని, గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసులు కేసులు నమోదు చేశారని, తామేమీ కొత్తగా కేసులు నమోదు చేయలేదని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నోటీసులు ఇవ్వాల్సి వస్తోందని అమాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. కాగా వైసీపీ మంత్రి విడదల రజిని ఒత్తిడితోనే పోలీసులు ఇలా చేస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. గెలుపు మీద నమ్మకం లేని మంత్రి, వైసీపీ నేతలు ఇలా ప్రతిపక్షాల చేతులు నరికేసి అడ్డదారిలో గెలుపొందాలని చూస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.

నోటీసులు ఇప్పుడెందుకు ఇస్తున్నారు?: కనపర్తి

కరోనా సమయంలో చేసిన ధర్నాలు, నిరసనలకు పోలీసులు ఇప్పుడు 41ఏ నోటీసులు ఇవ్వడమేంటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రశ్నించారు. అరండల్‌పేట స్టేషన్ ఎస్ఐ నాగేంద్ర, ఏఎస్ఐ నాగేశ్వరరావులు మంగళవారం కనపర్తిని ఆయన ఇంట్లో కలిసి నోటీసులు జారీ చేశారు. మొత్తం 6 కేసుల్లో ఆయనకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును ఆయన నిలదీశారు. తనపై 19 కేసులు నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారని, మంత్రి రజని ఒత్తిడితోనే పాత కేసులను బయటకు తీసి నోటీసులు ఇస్తున్నారని అన్నారు. కేసులు, నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని, న్యాయపోరాటం చేస్తానని తేల్చి చెప్పారు.

సాహితీ ప్రగతిని సాధించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9: ఆర్థిక, సాంకేతిక ఔన్నత్యంతో పాటు విద్యార్థులు సాహితీ ప్రగతిని సాధించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదు తెలిపారు. సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీక్రోధనామ సంవత్సర ఉగాది సందర్భంగా 27 వసంతాల సాహితీ వసంతోత్సవం మంగళవారం స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వైభవంగా జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వాహకులు రామారావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ మధ్య బెంచ్‌కు వచ్చి కేసులను చూస్తుంటే బాధగా ఉందన్నారు. వాటిలో ఆస్తి కోసం రక్తసంబంధీకులను చంపడం, వృద్ధులను ఆశ్రమాలకు పంపడం చూస్తుంటే మరింత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను ముందుతరాలకు అందించాలని, అప్పుడే మానవత్వ సహిత సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. కళలను ఎందుకు ఆదరించాలి, లేనిపక్షంలో జరిగే దుష్పరిణామాలను యువత తెలుసు కోవాలన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేదికలను ఏర్పాటు చేస్తున్న సాహితి సమాఖ్య కృషి అభినందనీయం అన్నారు. జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉగాది పర్వదినం రోజున శ్రీ రామ పట్టాభిషేకం, విక్రమాదిత్య, శాలివాహన రాజ్యాలు ఆవిర్భావం జరిగాయని, ఇటువంటి రోజున పండుగ జరుపుకోవడం శుభపరిణామం అన్నారు. అంతకుముందు శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం సుప్రసిద్ధ పండితులు, అవధాని డాక్టర్.ధూళిపాళ్ళ మహాదేవమణికి క్రోధనామ సాహితీ పుర స్కారం ప్రదానం చేశారు. అవార్డు గ్రహీత చంద్ర బోస్‌కు సత్కారం చేశారు. సాహితీ సమ్మేళనంలో కేంద్ర సాహిత్య అకాడమీ సరస్వతి సమ్మాన్ కె.శివారెడ్డి, పండితులు మహాదేవమణి, సినీ నృత్యదర్శకులు సుచిత్ర చంద్రబోస్, కవి డాక్టర్. అందేశ్రీ, శతావధాని డాక్టర్. బులుసు అపర్ణ, యువ అవధాని ఉప్పలదడియం భరత శర్మ, సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.


డాక్టర్. ధూళిపాళ్ళ మహాదేవమణికి శ్రీక్రోధ నామ సాహితీ పురస్కారం అందజేస్తున్న జస్టిస్ యూ దుర్గాప్రసాదు, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్




వైభవంగా బాజీబాబా ఉరుసు మహోత్సవం

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షాహిద్ ఆవులియ బాబా దర్గా 536వ ఉరుసు మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన బాబా భక్తులతో దర్గా ప్రాంగణం జనసంద్రంగా మారింది. దర్గా నుంచి బాజీబాబా గుర్రం పెదకాకాని, వెనిగండ్ల పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం తిరిగి దర్గాలోకి ప్రవేశించారు. బాజీ బాబా దర్గాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు గంధం పంచిపెట్టారు. భక్తులు దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ఈవో షేక్ ముక్తార్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేట లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా సుధాకర్

నరసరావుపేట, ఏప్రిల్ 9: నరసరావుపేట కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా పట్టణానికి చెందిన గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆయన పేరును మంగళవారం ప్రకటించారు. ఆయన నరసరావుపేటలో న్యాయవాద వృత్తిలో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు మేరకు నరసరావుపేటలో పలు కార్యక్రమాలను అలెగ్జాండర్ నిర్వహించారు.

ఆశా కార్యకర్త వైసీపీ ప్రచారం



నూజెండ్ల, ఏప్రిల్ 9: మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త మూలవీసాల రేణుకాదేవి సోమవారం మండలంలోని జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రలో పాల్గొన్నారు. వైసీపీ గుర్తులు ఉన్న టోపీ ధరించి పార్టీ ప్రచారంలో పాల్గొన్నారు. ఇతర పార్టీ నాయకుల గురించి ఆమె చులకనగా మాట్లాడటంపై మంగళవారం టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

వైభవంగా దశావతారునికి పుష్ప యాగం



పెదకాకాని, ఏప్రిల్ 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీదశావతార వెంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి అత్యంత వైభవంగా పుష్పయాగం జరిపించారు. ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర రావు దంపతులచే బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ఆరు టన్నుల 14 రకాల ప్రత్యేక పచ్చి పూలతో ఏడుకొండలుగా డెకరేషన్ చేశార ఉదయం ఐదు నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయాన్ని కృష్ణా గుంటూరు జిల్లాలకు చెందిన వేలాదిమంది భక్తులు దర్శించారు. దశావతార వెంకటేశ్వర స్వామివారికి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనేకమంది ప్రముఖులు ఆలయాన్ని దర్శించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణాన్ని జరిపించారు.

వలంటీర్లకు టీడీపీలో మంచి భవిష్యత్ : యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న వలంటీర్లకు రానున్న టీడీపీ ప్రభుత్వంలో మెరుగైన వేతనాలతో పాటు మంచి భవిష్యత్ వుండేలా చూడటం జరుగుతుందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది తీపికబురుగా చంద్రబాబునాయుడు ప్రకటన రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లలో హర్షం వ్యక్తమవుతుందని, వలంటీర్ల కనీస వేతనం రూ.10 వేలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్ వున్న వారికి మరికొన్ని అవకాశాలతో ఎక్కువ వేతనం అందజేసేలా చూడటం జరుగుతుందన్నారు. వైసీపీ నేతల మాటలు నమ్మి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొని భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దన్నారు. ఐదేళ్లుగా పనిచేస్తున్న వలంటీర్లకు గౌరవ వేతనం పెంచకుండా ఎన్నో పనులు చేయించుకుంటున్నారన్నారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుంది.. అప్పటి నుంచి వలంటీర్ల ద్వారానే అవ్వ, తాతల ఇళ్లకు వెళ్లి రూ.4 వేల పింఛన్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. వలంటీర్లు ఎవరైనా కూడా రాజీనామాలు చేయవద్దని, భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని యరపతినేని సూచించారు.

రాబోయే చంద్రన్న పాలనలో ఇంతకు మించి పింఛన్లు

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 9: పెన్షన్‌లు, సంక్షేమం జగన్ ముఖ్యమంత్రి కాక ముందు ఉన్నాయి.. దిగి పోయిన తరువాత ఉంటాయని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ఈ నిజాన్ని దాచి కొంత కాలంగా ఏదో వైసీపీ ఓడిపోతే పెన్షన్‌లు ఆగిపోతాయని వైసీపీ నేతలు, జగన్ వాళ్ళ బ్లూ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. అబద్దపు ప్రచారం ద్వారా ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించి భయపెట్టి ఓట్లు దండుకోవాలనే కుట్ర వారి చర్యల్లో కన్పిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో 18వ వార్డులో మంగళవారం ఎన్నికల శంఖారావం, సూపర్ - 6 పథకాలపై ప్రత్తిపాటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. వృద్ధుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కుటుంబ సాధికార సారథులు, బూత్ కమిటీ కన్వీనర్లు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎవ్వరూ వైసీపీ, జగన్ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, రానున్న ప్రజా ప్రభుత్వంలో చంద్రన్న ముఖ్యమంత్రిగా ఇంతకు మించి పింఛన్‌లు, ఇంతకు మించి సంక్షేమాన్ని అందుకుంటారని భరోసాను ఇచ్చారు. ఉమ్మడి అభ్యర్థిగా తనను, ఎంపీ పార్లమెంట్ అభ్యర్థిగా శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్, తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని మల్లన్న సన్నిధిలో జరిగిన ఉగాది వేడుకల్లో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. మంగళవారం రాత్రి ఆలయానికి చెందిన పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఆలయ ఈవో, ఉప కమిషనర్ శ్రీరామవరప్రసాద్‌లు ఉగాది పురస్కారాలను అర్చకులకు అందజేశారు. అర్చకులను సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమం అంతా ఆలయ పాలక మండలి చైర్మన్ శివశంకరరావు, మరికొందరు పాలక వర్గ సభ్యులు దగ్గరుండి నిర్వహించారు. ఎన్నికల కోడ్ గత నెల 16 నుంచి అమలులోకి రాగా శివాలయంలో ఇప్పటికే ఆలయ చైర్మన్ తన చాంబర్‌లో రూమ్‌లను వినియోగించుకోవటమే కాకుండా ఆలయంలో ఎన్నికల కోడ్ అమలు చేయటం లేదు. దీనిపై పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదులు అందాయి.

రైల్వేస్టేషన్‌లో కాపర్ వైరు చోరీ

రొంపిచర్ల, ఏప్రిల్ 9: మండలంలోని రొంపిచర్ల రైల్వేస్టేషన్‌లో కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి చోరీ చేశారు. రెండు గంటల తరువాత సుమారు పదిమంది వ్యక్తులు స్టేషన్ వద్దకు వచ్చి రాళ్ళు విసిరారు. అనంతరం మెట్ల పక్కన ఉన్న కాపర్ వైరును దొంగతనం చేసి తీసుకు వెళ్ళారు. ఈ ఘటనపై సమాచారాన్ని రొంపిచర్ల పోలీసులకు, రైల్వే పోలీసులకు అక్కడ ఉన్న సిబ్బంది తెలిపారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలించి వెళ్ళారు.

20 రోజుల పాటు జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు - మంగళగిరి మధ్యన రైల్వేట్రాక్ మరమ్మతులు కారణంగా ట్రైన్ నెంబరు.12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ని దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ రైలు న్యూగుంటూరు రాకుండా తెనాలి నుంచి నేరుగా కృష్ణాకెనాల్ మీదగా విజయవాడకు చేరుకొంటుంది. అలానే నెంబరు 07464 విజయవాడ - గుంటూరు ప్యాసింజర్ రైలుని పైన పేర్కొన్న తేదీల్లో పూర్తిగా రద్దు చేశామన్నారు. నెంబరు.07465 గుంటూరు - విజయవాడ రైలు కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

గిరిజన ద్రోహి సీఎం జగన్

గుంటూరు, ఏప్రిల్ 9: ఎస్టీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూనాయక్ అన్నారు. వైసీపీ పాలకులు ఎస్సీ, ఎస్టీ, మైనారి టీ, బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసి నయవంచనకు గురి చేశారన్నారు. టీడీపీ హయాంలో 500 మంది జనాభా కలిగిన గ్రామాలను ప్రత్యేక పంచాయితీలుగా ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తే జగన్‌రెడ్డి అధికార అందలం ఎక్కిన తర్వాత గిరిజన గ్రామాలకు పంచాయితీ నిధులు కేటాయించక పోవటమే కాకుండా సబ్ ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించారన్నారు. గత ఎన్నికల్లో 87 శాతం గిరిజనులు జగన్‌రెడ్డికి ఓట్లు వేసినా ప్రతీకార చర్యగా వారిపైనే కేసులు, భౌతిక దాడులు సాధారణమయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో గిరిజన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అంబేద్కర్ విదేశీ విద్య పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	154, 163,174
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

సెలవు రోజుల్లోనూ జీఎంసీ క్యాష్ కౌంటర్లు పని చేస్తాయి



కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్ 9: రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పన్నును ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు సెలవు రోజుల్లో కూడా పని చేసేలా అదనపు క్యాష్ కౌంటర్లను, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్‌లోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్‌కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం రూ.67 లక్షలు పన్ను చెల్లింపు జరిగిందని తెలిపారు.

ఎన్నికల్లో వైసీపీ గెలుపు అంతంతమాత్రమే

● పోస్టర్లను ఆవిష్కరించిన జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 9: అరాచకాలు, దుర్మార్గాలు, దౌర్జన్యాలు, దాష్టీకాలతో ఐదేళ్లుగా రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో గెలుపు అంతంతమాత్రమేనని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. ఎర్రచందనం స్మగ్లర్‌లకు, గంజాయి, మాదకద్రవ్యాలు సరఫరా చేసిన వారికి భూ కబ్జాదారులకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వటమే కాకుండా వాళ్ళు సచ్చీలురని, ఆర్థికంగా కూడా అంతంతమాత్రమే అంటూ స్వయంగా ముఖ్యమంత్రి చెప్పటం అత్యంత హేయమని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో 175 నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపు అంతంతమాత్రమే అంటూ ముద్రించిన పోస్టర్లను 22వ డివిజన్లోని శ్రీనివాసరావుతోటలో మంగళవారం జనసేన శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ దాదాపుగా కోట్లకు పడగలెత్తిన వారేనన్నారు. ఎర్రచందనం, గంజాయి స్మగ్లర్ల భుజాలపై చేతులు వేసి వీళ్ళు మంచివాళ్ళు, సౌమ్యులు అంటూ ముఖ్యమంత్రే ప్రజలకు పరిచయం చేయటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని, ముందుతరాల వారి భవిష్యత్‌ను కాపాడుకోవాలి అంటే రాష్ట్రం నుంచి వైసీపీని తరిమేయాలని ఆళ్ళ హరి ప్రజల్ని కోరారు. జనసేన డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్, గడ్డం రోశయ్య, కొలసాని బాలకృష్ణ, నగర టీడీపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీమ్, పూసల శ్రీనివాస్, నందూరి స్వామి, కోటంశెట్టి బాలు, ఉదయ్ చంద్ర, సురేంద్ర, రమేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

చంద్ర రాజేశ్వరరావు చేసిన పోరాటాలు ఎనలేనివి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9 : బడుగు, బలహీన వర్గాల హక్కులకై చంద్ర రాజేశ్వరరావు చేసిన పోరాటాలు ఎనలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ కొనియాడారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగించడమే ఆయకిచ్చే ఘనమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, మేడా హనుమంతురావు, పుప్పాల సత్యనారాయణ, వలీ, నాసర్‌జీ తదితరులు పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కాంగ్రెస్ నగర అధ్యక్ష పదవికి షేక్ ఉస్మాన్ రాజీనామా

గుంటూరు, ఏప్రిల్ 9: కాంగ్రెస్ నగర అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న షేక్ ఉస్మాన్ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఏపీసీసీతో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావుకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మాట్లాడుతూ కొందరు నేతల స్వార్థ ప్రయోజనాల కోసం తన లాంటి కిందిస్థాయి నాయకులను అణగదొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో నిస్వార్థంగా సేవలందించానని, వివిధ పదవులు నిబద్ధతతో నిర్వర్తించానన్నారు.

తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పిస్తామని మాట తప్పారన్నారు. పార్టీలో తనకు అన్యాయం జరగటంపై ఎంతో బాధగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9 : స్థానిక బ్రాడీపేట, శ్రీ అభయ హస్త షిరిడి సాయి సేవ ట్రస్ట్ ఆలయంలో స్వరరాగ సుధా ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీ, గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి, నరసింహారావు పలు అన్నమయ్య గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ, తబాలపై షణ్ముఖశర్మ వాద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఏప్రిల్ 9 : విద్యుత్‌లైన్ నిర్వహణలో భాగంగా చెట్ల కొమ్మలు తొలగించేందుకు బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీ 13 సెక్షన్ పరిధిలోని కాకాని రోడ్డు లో గల సీతారామన గర్, అంబేద్కర్‌నగర్, అరుంధతీనగర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ వీహెచ్ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.





బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల నుంచి ఆశీర్వచనం తీసుకుంటున్న భక్తులు, ఉగాది పచ్చడి పంపిణీ

వైభవంగా శ్రీ క్రోధి నామ ఉగాది వేడుకలు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం



పంచాంగ పఠనం చేస్తున్న నోరి నారాయణమూర్తి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా నగరంలోని ఆలయాలలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విశిష్ట సేవ లందించిన ప్రముఖులకు, కళాకారులకు పురస్కారాలు అందించి సత్కరించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యవర్గ సభ్యుల ఆధ్వ ర్యంలో ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి, కృష్ణ బృందం నిర్వహణలో అత్యంత శోభాయమానంగా అలంకరించిన శ్రీవారి దర్శనం ఉదయం ఐదు గంటల నుంచే ప్రారంభమైంది. విశేషంగా పాల్గొన్న భక్తులు, అనేక మంది పుర ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను అందుకొన్నారు. తొలుత నాగార్జున సాంస్కృతిక కేంద్రం నిర్వహణలో అన్నమయ్య కళావేదికపై ఆర్.సూర్యలక్ష్మిచే శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తిచే పంచాంగ శ్రవణం అనంతరం కవి సమ్మేళనం జరిగాయి. సాయంత్రం సంగీత విభావరి నిర్వహించారు.

● స్థానిక గోరంట్ల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన సొసైటీలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అత్యంత శోభాయమానంగా ముత్యాలతో అలంకరించిన శ్రీవారి దర్శనం ఉదయం ఐదు గంటల నుంచే ప్రారంభమైంది. విశేషంగా పాల్గొన్న భక్తులు, అనేక మంది పుర ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను అందుకొన్నారు. పంచాంగ శ్రవణం, అనంతరం కవి సమ్మేళనం జరిగాయి. సాయంత్రం అత్యంత వైభవోపేతంగా శ్రీ శ్రీనివాస కల్యాణం నిర్వహించారు.

● స్థానిక స్తంభాలగరువులోని శ్రీ కోదండ రామాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. శోభాయమానంగా ముత్యాలతో అలంకరించిన శ్రీవారి దర్శనం ఉదయం ఐదు గంటల నుంచే ప్రారంభమైంది. విశేషంగా పాల్గొన్న భక్తులు, అనేక మంది పుర ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను అందుకొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులు దర్బార్ ఉత్సవం, చతుర్వేది పారాయణం నిర్వహించారు.



స్తంభాలగరువులో కోదండ రామాలయంలో స్వామి వారికి దర్బార్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మస్తాన్‌వలి

ఆలయంలో మస్తాన్‌వలి ప్రత్యేక పూజలు

గుంటూరు, ఏప్రిల్ 9: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి మంగళవారం పాతగుంటూరులోని వినాయకుని ఆలయంతో పాటు అంకమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు అంబటి రత్తయ్య, మైలా కిరణ్, రామకృష్ణ, కట్ట జవహర్ బాబు, సాంబశివరావు, మౌలాలి, విజయ్ గౌడు, మోషే తదితరులున్నారు.

మంత్రి రజనీ కార్యాలయంలో ఉగాది వేడుకలు

గుంటూరు, ఏప్రిల్ 9 : చంద్రమౌళినగర్‌లోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో మంత్రి హాజరై ఆమె స్వయంగా అందరికీ ఉగాది పచ్చడి పంచి పెట్టారు. ఉగాది వేడుకల్లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అమరావతి రోడ్డు 49వ డివిజన్ కొండయ్యకాలనీ ఒకటో లైనులో శ్రీ లక్ష్మీపోలేరమ్మ తల్లి దేవస్థానం మూడో వార్షికోత్సవంలో మంత్రి రజనీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నల్లపాడు రోడ్డులోని నల్లకుంట 12వ లైనులో త్రిశక్తి నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఉత్సవాలకు మంత్రి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు

కిటకిటలాడిన కాకాని మల్లన్న సన్నిధి

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తజన సందోహంతో కిటకిటలాడింది. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని భక్తులు పెద్దఎత్తున దర్శించారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి వారికి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం ఆలయంలో ఆలయ ఈవో, ఉప కమిషనర్ శ్రీరామ్ వరప్రసాద్, ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణాన్ని జరిపించారు.

విజయకీలాద్రిపై ఉగాది వేడుకలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 9: ఎంటిఎంసి పరిధిలోని సీతానగరం విజయ కీలాద్రి దివ్యక్షేత్రంపై వేదవిశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి మంగళశాసనాలతో ఉగాది వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం శ్రీసీతారామచంద్రులకు అభిషేక మహోత్సవం, శ్రీదేవి-భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారికి నిత్య కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీ క్రోధి నామసంవత్సర పంచాంగ శ్రవణం అర్చకులు నిర్వహించారు. అలాగే క్రోధి నామ సంవత్సర వసంత నవరాత్రి ఉత్సవాలు ఉగాది నుండి శ్రీరామనవమి వరకు ఘనంగా ప్రారంభమయ్యాయి. సీతారామస్వామి వార్లకు సుందరకాండ పారాయణ శ్రీరామ లేఖనం, శ్రీరామ పూజ, సాయంకాల సమయంలో శ్రీఆంజనేయ స్వామి అష్టోత్తర శతనామ పూజ, కార్యక్రమాలు జరిగాయి. చిన జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, వేద పండితులు, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



విజయకీలాద్రిపై పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

నృసింహునికి బంగారు గరుడోత్సవం

● అద్దాల మహల్‌లో పవళింపు సేవ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 9: మంగళాద్రి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి ఆస్థాన అలంకారోత్సవాల ముగింపు సందర్భంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీవారికి బంగారు గరుడోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి మంగళగిరికి చెందిన నంది కంటి వెంకట హనుమాన్ ప్రసాద్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. అనంతరం గులాబీలతో సహస్ర నామార్చన, అద్దాల మహల్‌లో పవళింపు సేవ గావించారు. ఈ ఉత్సవానికి విజయవాడకు చెందిన కనకవల్లి తాయారమ్మ కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బంగారు గరుడోత్సవంలో పాల్గొన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి

కొనసాగుతున్న జాతీయస్థాయి నాటకోత్సవాలు



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కళాపరిషత్ సభ్యులు

యడ్లపాడు, ఏప్రిల్ 9: యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటకోత్సవాలు మూడోరోజు మంగళవారం కొనసాగాయి. సంయుక్త నిర్వహణలో భాగంగా తొలి రెండురోజులు 7, 8 తేదీలలో లింగారావుపాలెంలోని పోసాని సుబ్బారావుచౌదరి కళావేదికపై పోటీలను నిర్వహించారు. కాగా మంగళవారం రాత్రి యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని ఎంవీచౌదరి కళావేదికపై మూడో రోజు పోటీలను నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా కళాకారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి నాటిక ప్రదర్శన అనంతరం హాజరైన ప్రేక్షకుల నుంచి సేకరించిన కూపన్లను లక్కీ డ్రా నిర్వహించి మొత్తం 10 మంది విజేతలకు ప్రత్యేక బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో పోపూరి సుబ్బారావు, ఉపేంద్ర, పోపూరి గంగయ్య చౌదరి, చిట్టినేని లక్ష్మీనారాయణ, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావు, ముత్తవరపు పద్మారావు, కొడవీడు కళాపరిషత్ సభ్యులు కట్టా శ్రీహరి, తోకల సాంబశివరావు, మల్నేని సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

● పిల్లల తప్పుల్ని, తొందరపాటుతనాన్ని సరిదిద్దుతూ, మరో పక్క క్రమశిక్షణ నేర్పుతూ.. ఒక నాన్నగా తనేం చేయగలడో, నాన్న గొప్పతనాన్ని ప్రతి కూతురు, కొడుకు తెలుసుకోవాల్సిన సత్యమని అలాంటి తండ్రి ఉంటేనే ఏ ఇల్లైనా 'ఇంద్రప్రస్థం'లా వెలిగిపోతుందంటూ అభినయ ఆర్ట్స్, గుంటూరువారు ప్రదర్శించిన నాటికను గోపి సత్యప్రకాష్ రచించగా, ఎన్ రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.

● కడదాకా కలసి భార్యాభర్తలు చేసే ప్రయాణం 'బంధం' నాటిక. వృద్ధాప్యంలో ఈ 'బంధం' మరింత బలపడి ఒకరికోసం ఒకరు ఎలా మిగిలిపోతారో తెలిపుతూ మైత్రీ కళానిలయం, విజయవాడ వారు ప్రదర్శించిన నాటికను మాడుగుల రామకృష్ణ రచించగా, టివి పురుషోత్తం దర్శకత్వం వహించారు.

● కష్టం వస్తే నా తలరాత బాగోలేదు అంటూ, సుఖంగా ఉంటే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే మనిషి నైజంతో జరిగే అనర్థాలపై సాగిన కథనమే 'రాత'నాటిక. ఈ నాటికను కూడా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారు ప్రదర్శించగా, పొలుసుదాసు శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు చెబుతున్న గల్లా మాధవి

తెలుగు సంవత్సరాదిలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాదిలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా గుంటూరు శ్రీనివాసరావుపేటలోని పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, మోదీల నేతృత్వంలో ఈ క్రోధి నామ సంవత్సరంలో ప్రజాప్రభుత్వాన్ని స్థాపించబోతున్నట్లు ఆమె చెప్పారు. కార్యాలయంలో పార్టీ నేతలకు ఉగాది పచ్చడి, ప్రసాదాలు అందజేశారు. అనంతరం టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకలకు హాజరై, అధినేత చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. గుజ్జనగుండ్ల నాయీ బ్రాహ్మణ కాలనీలో జరిగిన నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో మాధవి పాల్గొన్నారు.



గల్లా మాధవికి ఉగాది శుభాకాంక్షలు చెబుతున్న టీడీపీ నేతలు



తెలుగు తమ్ముళ్లకు ఉగాది పచ్చడి ప్రసాదాన్ని పెడుతున్న గల్లా మాధవి

ఉత్సాహంగా ఉగాది వేడుకలు

గుంటూరు, ఏప్రిల్ 9: అరండల్‌పేటలోని కార్యాలయంలో అవగాహన సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. విద్యావేత్త శాంతా శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ప్రముఖ సాహితీవేత్త భూసురుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడు మారిన జీవితా ల్లో వెలుగులు తప్పక నిండుతాయని ప్రకృతి చెప్పే గొప్ప సందేశాన్ని తీసుకొ చ్చేదే ఈ ఉగాది అన్నారు. అనంతరం బి జమదగ్ని, ఎస్ఎం సుభాని, పింగళి భాగ్యలక్ష్మి, రాజన్న, శేషఫణిశర్మలు తమ కవితలను వినిపించారు. కోఆర్డినేటర్ బీక్క అశోక్ నిర్వహించగా రామకృష్ణరెడ్డి ,సాయిబాబ, కొనతం నాగేశ్వరరావు, మల్లేశ్వరరావులు అద్భుతంగా పాటలు ఆలపించారు. డాక్టర్ టీవీ రాంకుమార్, రామడుగు వెంకటేశ్వరశర్మ ,డాక్టర్ మైలవరపు లలిత కుమారుల కు ఉగాది పురస్కారాలు అందజేసి సత్కరించారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, పీఎస్ మూర్తి, ఏవీకే సుజాత, పింగళి భాగ్యలక్ష్మి తదితరులున్నారు.



ఉగాది వేడుకల్లో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్‌లను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా జడ్జీ, కలెక్టర్

హైకోర్టు జడ్జీలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన జిల్లా జడ్జి, కలెక్టర్

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్రోధి నామ ఉగాది వేడుకల్లో పాల్గొనేందుకు గుంటూరు నగరానికి వచ్చిన హైకోర్టు జడ్జీలను జిల్లా జడ్జీ వైవీఎస్‌బీజీ పార్థసారధి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక రోడ్లు, భవనాల అతిథిగృహానికి మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ వచ్చారు. వారిని ప్రొటోకాల్ ప్రకారం జిల్లా జడ్జీ, కలెక్టర్ కలిసి స్వాగతం పలికారు.

కేజేఎస్ఎస్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

గుంటూరు తూర్పు, ఏప్రిల్ 9: కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు ప్రారంభించారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్ కుందుల రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కోటేశ్వరరావు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజేఎస్ఎస్ పాలకవర్గం సమితి ఆశయాలలో ఒకటైన సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఉగాది సందర్భంగా వసతిగృహంలో విద్యార్థినులకు బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తిచే పంచాంగ శ్రవణం చేయించారు. కార్యక్రమంలో సమితి నాయకులు గోరంట్ల పున్నయ్య చౌదరి, గుంటుపల్లి కోటేశ్వరరావు, మర్రిపూడి సీతారామయ్య, గంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, దండా బ్రహ్మానందం, కట్టా శివాజీ పాల్గొన్నారు.



ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమ్మజన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు

Sitaram Jindal Foundation Scholarship Scheme



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the postgraduate level. It aims to provide financial assistance to underprivileged students pursuing various degree/diploma courses.
Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.
Prizes & Rewards: Up to 3,200 per month
Last Date to Apply: Round The Year
Application mode: By post to: The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073
Short Url: www.b4s.in/aj/SJS2

SCHOLARSHIP ALERT

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/ private open schools or open universities.
Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.
Prizes & Rewards: Scholarship up to INR 40,000 ***Last Date:*** 30-04-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.
Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.
Prizes & Rewards: 50% of the tuition fees for one year of study
Last Date to Apply: 24-05-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LPUK1

buddy4study.com

దిక్సూచి DIKSUCHI

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈసారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా **3,712** పోస్టులను భర్తీ చేయనున్నారు.

భర్తీ చేసే పోస్టులు

1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్స్యూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్ల గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** ssc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0U9xCcMలో చదవండి.

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ

దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యు), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.
ఎంఎస్‌డబ్ల్యు: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.
ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in



హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య- ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిల్లు స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో



కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు.. మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనిక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫోర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బుల్గానిన్, డీఓపి: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాధృచ్చికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు మిగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/461Zp1y లో చదవండి.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎడురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.







పెదకాకాని శివాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు

కిటకిటలాడిన కాకాని మల్లన్న సన్నిధి

● వైభవంగా పంచాంగ శ్రవణం

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తజన సందోహంతో కిటకిటలాడింది. మంగళవారం ఉగాది పర్వతనాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని భక్తులు పెద్దఎత్తున దర్శించారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి వారికి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. సాయంత్రం ఆలయంలో ఆలయ ఈవో, ఉప కమిషనర్ శ్రీరామ్ వరప్రసాద్, ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణాన్ని జరిపించారు.



ముస్లిం మహిళలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్న

జెండా చెట్టు బజారులో ఇఫ్తార్



ముస్లింలకు ఇఫ్తార్‌ను వడ్డిస్తున్న నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, ఏప్రిల్ 9: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం, మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నందులపేట జెండా చెట్టుబజార్‌లో ముస్లిం మైనార్టీ సోదరులు ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో నాదెండ్ల మనోహర్, ఉమ్మడి పార్టీల గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్నలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపిన అనంతరం ముస్లింలకు ఇఫ్తార్‌ను వడ్డించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, జనసేన పట్టణ అధ్యక్షుడు తోటకూర వెంకటరమణారావు, గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ నాయకులు వీరవల్లి మురళి, ఈదర వెంకటపూర్ణచంద్, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, జాకీర్ హుస్సేన్, శాఖమూరి సురేంద్ర, కమ్మెల శ్రీనివాసరరావు, కావూరి చంద్రమోహర్, నిర్వాహక కమిటీ సభ్యులు, ఉమ్మడి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న గాయని శాంత

శ్రోతలను అలరించిన సంగీత కచేరీ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 9: సంగీత జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ శ్రోతలను అలరించింది. గాంధీ చౌక్‌లోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత గోవర్ధనస్వామి ఆలయంలో మంగళవారం సంగీత కచేరీ నిర్వహించారు. విజయవాడ గాయని శాంత వాగ్గేయకారుల కృతులను గానం చేశారు. కేవీ రామకృష్ణ, చావలి శ్రీనివాస్ వాయిద్య సహకారం అందించారు.

ఘనంగా శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు

● పలుచోట్ల పంచాంగ శ్రవణం

● సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణం



పంచాంగ పఠనం చేస్తున్న విశ్వనాథశర్మ, సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 9 : శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో జరిగిన ఉగాది వేడుకలు, సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరయ్యారు. ఉప్పల వరదరాజులు, నూకల వేణు, మాలేపాటి హరిప్రసాద్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం బాల బాలికలు, మహిళ భక్తులు హనుమాన్ చాలీసా, సహస్రగళ పారాయణ చేశారు.



కొల్లిపర శివాలయంలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు కుటుంబరావు, పాల్గొన్న గ్రామస్థులు

తాలూకా జూనియర్ కళాశాలలో బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్య పండితులు జీవీఎల్ఎన్ చార్యులు క్రోధి నామ సంవత్సరం కుజుడు రాజు కావడం వలన ఉగ్రదాడులు పెరుగుతాయని, అగ్ని ప్రమాదాలు ఎక్కువవుతాయని, భూగర్భ జలాలు తగ్గిపోతాయని చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బాగా పుంజుకుంటుందని, ఎర్ర ధాన్యాల పంటల ధరలు పెరుగుతాయని, విద్యార్థులకు వాహనాలు కొనిపెడితే ప్రమాదాలబారిన పడతారని చెప్పారు. సోషల్ మీడియాపై ఆంక్షలు పెరుగుతాయని, టీవీ సీరియల్స్‌ను కూడా సెన్సార్ చేసే ఆలోచన వస్తుందన్నారు. పరిషత్ కార్యదర్శి పి.పురుషోత్తమ శర్మ, అధ్యక్షుడు వీవీ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు. రామలింగేశ్వరపేట మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. జ్యోతిష్యరత్న రాంపల్లి సుబ్రహ్మణ్య ప్రసాద్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆమంచి సీతారామాంజనేయ శాస్త్రి సంకలనం చేసిన శివస్తుతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. సూర్యనారాయణమూర్తి, కామేశ్వరరావు, ప్రసాదరావు, అనీల్, నాగేంద్ర, వేణు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఉగాది పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాలు కిటకిటలాడాయి. తెలుగు సంవత్సరం అన్నింట ఆనందం ఇవ్వాలని కోరుకుంటూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించారు. వైకుంఠపురం, పాత శివాలయం, మారీసుపేట శివాలయం, సాయిబాబా ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది.

తెనాలి రూరల్, ఏప్రిల్ 09: తెలుగు సాహితీ సౌరభమ్ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు మోదుకూరు రాధాకృష్ణశర్మచే పంచాంగశ్రవరణం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన తెనాలి పినపాడు గేటు వద్ద నిర్వహించారు. ప్రముఖ సిద్దాంతి మోదుకూరు రాధాకృష్ణ శర్మ తెలుగు సంవత్సరాది పర్వదిన పంచాంగశ్రవణం ప్రాముఖ్యతను, వివిధ రాశులు ఫలితాలను వివరించారు. అనంతరం ఉగాది పచ్చడిని ప్రజలకు వితరణ చేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



భవనారాయణ స్వామి ఆలయంలో పంచాగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా గ్రామాల్లో ఉగాది వేడుకలు

కొల్లిపర, ఏప్రిల్ 9: మండలంలోని గ్రామాల్లో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని దేవాలయాల్లో పండితులు వివిధ అభిషేకాలతో పాటు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రం కొల్లిపర గంగాపార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి దేవాలయంలో, జనార్ధనస్వామి ఆలయంలో, శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో పండితులు కుటుంబరావు, జగన్నాధాచార్యులు, కుమారస్వామి వివిధ అభిషేకాలు నిర్వహించి వచ్చిన భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. గంగా పార్వతీ సమేత శ్రీముక్తేశ్వరస్వామి ఆలయంలో పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. కొల్లిపర మండల బ్రాహ్మణ ఐక్యవేదికలో పండితులు జగన్నాధాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ హోమం నిర్వహించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఉచితంగా పంచాంగం పుస్తకాలను పంపిణీ చేశారు. రైతులు, వ్యాపారవేత్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వంగా కోటిరెడ్డి భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

పొన్నూరు నియోజకవర్గంలో...

పొన్నూరు టౌన్, చేబ్రోలు, ఏప్రిల్ 9: పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో మంగళవారం తెలుగు నూతన సంవత్సరం క్రోధి నామ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు సంవత్సరం ఆరంభాన్ని పురస్కరించుకుని ఆలయాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. సాయంత్రం పట్టణంలోని భవనారాయణ స్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో పంచాగ పఠన కార్యక్రమం జరిగింది. వేద పడింతులు క్రోధి నామ సంవత్సరంలో జరిగే విశేషాలు, భవిష్యత్తులో జరగబోయే ఫలితాల గురించి పంచాగపఠనంలో వినిపించారు. పంచాగ శ్రవణ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు.

చిన్నారులకు మిఠాయిల పంపిణీ

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 9: తెలుగు నూతన సంవత్సర ఉగాది వేడుకలను మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని యానాది సంఘంలో మంగళవారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఆంగ్ల సంవత్సరం వద్దు, తెలుగు సంవత్సరం ముద్దు అంటూ నినదిస్తూ ఉగాది వేడుకలు జరిపారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో చిలకపాటి సింహాద్రి, విరనాల ఆనంద్, జాన్నవి, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల రోడ్ షో విజయవంతం

● జన నీరాజనాల మధ్య టీడీపీ నాయకుల ప్రచారం

● వైసీపీకి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరిక



ఉప్పలపాడులో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న పెమ్మసాని, ధూళిపాళ్ల తదితరులు, బహిరంగ సభకు హాజరైన జనం

పెదకాకాని, ఏప్రిల్ 9: ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చేపట్టిన ఎన్నికల ప్రచారం తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, వెంకట కృష్ణాపురం, గొల్లమూడి, నంబూరు గ్రామాల్లో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. మంగళవారం టీడీపీ అభ్యర్థులు ఆయా గ్రామాల్లో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించింది. ఆయా గ్రామాల్లో జరిగిన రోడ్ షోలు, కార్నర్ మీటింగులకు ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఐదు గ్రామాల్లో ఒకే రోజు ఎన్నికల ప్రచారాన్ని నాయకులు పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లో నాయకులకు ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి పూలు చల్లి, భారీ బాణసంచా కాలుస్తూ ప్రచారాన్ని ముందుకు నడిపారు. ప్రజల నుంచి వచ్చిన అనూహ్యస్పందన కూటమి నాయకులు హర్ష వ్యక్తం చేశారు.

పెదకాకాని మండలంలో చేరికలు

పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఉప్పలపాడు గ్రామం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. చెన్నుపాటి కళ్యాణ్ పీఏసీఎస్ మెంబర్, త్రిమన్ కమిటీ మెంబర్ చెన్నపాటి శివకుమారి, వైసీపీ సచివాలయం కన్వీనర్, చలి చీమల రమాదేవి 3వ వార్డు నెంబర్ చలిచిమల శివాయని, చలిచిమల అశోక్, చలిచిమల భాగ్యలక్ష్మి, చలిచిమల విజయ, గోగినేని నాగమణి 4 వ నెంబర్ షేక్ మస్తాన్ బి దానబోయిన అనురాధ,ఆర్యాదుల నాగరాజ కుమారి, షేక్ హస్సేన్ మ్మ , సంధ్యారాణి, పచ్చగాళ్ల రాంబాబు పచ్చగాళ్ల సునీత రాగాంట్ల రవి పచ్చిగాళ్ల జోసప్ప, సత్తెనపల్లి రాంబాబు షేక్ మస్తాన్ వలి, మల్లవరపు మరియబాబు, పచ్చిగాళ్ల జోసప్ తంబి, మల్లవరపు మనోహర్, పత్రా బాల మన్నెయ్యలు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పొన్నూరు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మార్కెండేయులు బాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు వీరేళ్ళ వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు లక్ష్మారెడ్డి, గ్రామం పార్టీ అధ్యక్షుడు షైలా సుబ్బారావు, గ్రామం సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ దుద్దికూరి భూషిబాబు, ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, కొర్రపాటి సాంబశివరావు, దంతాల శ్రీనివాసరావు, పెద్ది కృష్ణ, మానుకొండ రామకృష్ణ, చెన్నుపాటి శ్రీకాంత్, తాడిగిరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు అండగా నిలవండి

● మనోహర్‌కు విశ్రాంత సైనికుల వినతి

తెనాలి రూరల్, ఏప్రిల్ 9: దేశ సరిహద్దులో రక్షణగా నిలిచే బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు ఉమ్మడి ప్రభుత్వం అండగా నిలిచి తమకు రావల్సిన బెన్‌ఫిట్స్‌ను అందించేలా కృషి చేయాలని ఆల్ ఇండియా సెంట్రల్ ప్యారా మిలటరీ ఫోర్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సురేంద్రబాబు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కోరారు. మంగళవారం తెనాలిలో బోస్‌రోడ్డులో గల జనసేన కార్యాలయంలో అసోసియేషన్ సభ్యులు నాదెండ్ల మనోహర్‌ను కలిసి వారి సమస్యలను వివరించి ఆయనకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సురేంద్రబాబు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం తామంతా సరిహద్దుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేశామన్నారు. అయితే మా బోర్డర్ సెక్యురిటీ ఫోర్స్ రక్షణశాఖ కిందకి రాదని కేవలం మినిస్ట్రీఆఫ్ హోమ్ కిందకు వస్తాయని తర్వాత తెలిసిందన్నారు. అందుకే రక్షణ శాఖకు ఏ బెనిఫిట్స్ వస్తాయో అలాగే మాకు కూడా అదేవిధంగా బెనిఫిట్స్ ఇప్పించాలని కోరారు. బోర్డర్‌లో పనిచేసే తామంతా యుద్ధం ఎప్పుడు వచ్చిన ముందుగా ప్రాణత్యాగం చేసేది తామేనని తెలిపారు. బెనిఫిట్స్ మాత్రం మాకు రావడంలేదని మనోహర్‌కు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి కూటమి అభ్యర్థుల ప్రభుత్వం ఏర్పడిన వెంకటనే తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని నాదెండ్ల మనోహర్‌ను అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తిచేశారు. మనోహర్ సానుకూలంగా స్పందిస్తూ తప్పనిసరిగా అసోసియేషన్ నాయకులు, సభ్యులు తెలిపిన విధంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామి ఇచ్చారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుండి వచ్చిన విశ్రాంత బోర్డర్ సెక్యురిటీఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించండి

● నాదెండ్ల మితుల్

తెనాలి రూరల్, ఏప్రిల్ 9: రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని జనసేన పీఏసీ చైర్మన్, ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ కుమారుడు మితుల్ కోరారు. మంగళవారం మండలంలోని కొలకలూరులో ఉమ్మడి పార్టీల శ్రేణులతో కలిసి మితుల్ ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు గాజు గ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామస్థులకు కరపత్రాలు అందించి అభ్యర్థించారు. పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై ఉగాది వేడుకలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 9: ఎంటిఎంసి పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై వేదవిశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి మంగళశాసనాలతో ఉగాది వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం శ్రీసీతారామచంద్రులకు అభిషేక మహోత్సవం, శ్రీదేవి-భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారికి నిత్య కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీ క్రోధి నామసంవత్సర పంచాంగ శ్రవణం అర్చకులు నిర్వహించారు. అలాగే క్రోధి నామ సంవత్సర వసంత నవరాత్రి ఉత్సవాలు ఉగాది నుండి శ్రీరామనవమి వరకు ఘనంగా ప్రారంభమయ్యాయి. సీతారామస్వామి వార్లకు సుందరకాండ పారాయణ శ్రీరామ లేఖనం, శ్రీరామ పూజ, సాయంకాల సమయంలో శ్రీఆంజనేయ స్వామి అష్టోత్తర శతనామ పూజ, కార్యక్రమాలు జరిగాయి. చిన జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ఆధ్వ ర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, వేద పండితులు, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.



విజయకీలాద్రిపై పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

కేజేఎస్ఎస్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

గుంటూరు తూర్పు, ఏప్రిల్ 9: కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు ప్రారంభించారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్ కుందుల రోడ్డులో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కోటేశ్వరరావు రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు.

సంగం ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తాం

● జనరల్ మేనేజర్ బ్రహ్మయ్య



ఉద్యోగి చంద్రశేఖర్ బాబుకు నివాళి అర్పిస్తున్న సంగం అధికారులు

చేబ్రోలు, ఏప్రిల్ 9: సంగం డెయిరీ ప్రగతిలో భాగస్వాములైన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తామని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ఎం బ్రహ్మయ్య తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలో సంగం ఉద్యోగి పుల్లగూర చంద్రశేఖర్ బాబు డెయిరీలో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందాడు. చంద్రశేఖర్ బాబు కుటుంబానికి సంగం డెత్ రిలీఫ్ ఫండ్ కింద రూ. 21,17,070/- చెక్ మంజూరైంది. మంగళవారం గరువుపాలెంలో చంద్రశేఖర్‌కు నివాళి అర్పించిన సంగం అధికారులు పరిహారాన్ని చంద్రశేఖర్‌బాబు భార్య తేజశ్రీకి అందచేశారు. ఈ సందర్భంగా తేజశ్రీ మాట్లాడుతూ ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న సంగం డెయిరీ పాలకవర్గం, చైర్మన్ నరేంద్రకుమార్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంగం అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



హనుమాన్ చౌక్‌లో వేసిన చలువ పందిళ్లు



శ్రీసీతారాముల శాంతి కళ్యాణం జరుపుతున్న భక్తులు

శ్రీరామ నవమి వార్షిక ఉత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 9: పట్టణంలోని బోసురోడ్డు, హనుమాన్ చౌక్‌లో శ్రీరామ నవమి 92వ వార్షిక ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శ్రీసీతారామ మందిరంలో ఉగాది నుంచి నవమి వరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించి చలువ పందిళ్లతో తీర్చిదిద్దారు. ఉత్సవ కలశ స్థాపన, అంకురార్పణ కార్యక్రమాలను విద్యాధర్, రజిత దంపతులు నిర్వహించారు. బీవీ సుబ్రహ్మణ్య శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. నాట్యమయూరి రంగనాయకి శిష్యబృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. నిత్యం శాంతి కల్యాణంలో భాగంగా దంపతులు స్వామి వారి కల్యాణం జరిపించారు. కమిటీ కార్యదర్శి కేవీ సూర్యనారాయణ మూర్తి, సభ్యులు, ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం నరసింహాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధాశ్రమంలో ఆహారం పంపిణీ

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 9: స్థానిక గాంధీనగర్‌లోని షిరిడిసాయి వృద్ధాశ్రమంలో మంగళవారం శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ చేశారు. యోగ సభ్యులు తలారి నర్సింహులు ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ యోగ కన్వీనర్ ముద్దా భక్తన్ని రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సునీత, తేజసాయి నరసింహ, యోగ సాధకులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థులను గెలిపించాలి

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప

కొల్లిపర, ఏప్రిల్ 9: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ప్రధానకార్యదర్శి జొన్నల శివారెడ్డి, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్, సొసైటీ అధ్యక్షుడు అరిమండ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ భట్టిప్రోలు వెంకటలక్ష్మి, నాయకులు అన్నాబత్తుని అఖిల్‌గణేష్, కల్లం వీరారెడ్డి, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి, బొంతు గోపిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బంగారు గరుడోత్సవంలో పాల్గొన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి

నృసింహునికి బంగారు గరుడోత్సవం

● అద్దాల మహల్‌లో పవళింపు సేవ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 9: మంగళాద్రి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారి ఆస్థాన అలంకారోత్సవాల ముగింపు సందర్భంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీవారికి బంగారు గరుడోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి మంగళగిరికి చెందిన నంది కంటి వెంకట హనుమాన్ ప్రసాద్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. అనంతరం గులాబీలతో సహస్ర నామార్చన, అద్దాల మహల్‌లో పవళింపు సేవ గావించారు. ఈ ఉత్సవానికి విజయవాడకు చెందిన కనకవల్లి తాయారమ్మ కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9 : స్థానిక బ్రా డీపేట, శ్రీ అభయ హస్త షిరిడి సాయి సేవ ట్రస్ట్ ఆలయంలో స్వరరాగ సుధా ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఏ ర్పాటు చేసిన భక్తి సంగీ త విభావరి ఆకట్టుకుంది. గాయనీ, గాయకులు కేవీ సాయిబాబా శర్మ, కృష్ణకుమారి, నరసింహారావు పలు అన్నమయ్య గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ, తబాలపై షణ్ము ఖశర్మ వాద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.